సాగుకు సన్నద్ధం

- వానాకాలం పంటలకు సిద్ధమవుతున్న రైతన్న
- దుక్కులు సిద్ధం, పొలాలకు తరలించిన ఎరువులు
- అందని సబ్సిడీ విత్తనాలు

మహేశ్వరం: వానాకాలం సీజన్‌లో పంటల సాగు కోసం రైతులు సిద్ధమవుతున్నారు. పశువుల ఎరువులను పొలాలకు తరలించడంతో పాటు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే తొలకరి పలకరించడంతో విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. మహేశ్వరం మండంలో.. రైతులు ఇప్పటికే కూలీ(పాలేర్లు)లతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. గతేడాది మే రెండవ వారం వరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేవి. ఈ ఏడాది జూన్ నెల చివరికి వస్తున్నా విత్తనాలు, ఎరువుల సరఫరా ఊసేలేదని అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. నాణ్యమైన వరి, జొన్న, కంది, మొక్కజొన్న, పత్తి, పప్పుదినుసుల విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. దీంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు డబ్బులు ఇంకా జమకాకపోవడంతో రైతులకు ఎటూ తోచని పరిస్థితి ఉంది. అయితే కొంతమంది ఇప్పటికే అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు తెప్పించి సాగు పనులు షురూ చేశారు.

మార్కెటింగ్ ఎలా...

ప్రతీ ఏటా రైతులు పంటలు వేసేముందు తాము పండించిన పంటలు ఎక్కడ మార్కెటింగ్ చేయాలి అనే సందిగ్ధంలో ఉంటారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం మొక్క జొన్న వేయొద్దని చెబుతూ వస్తోంది. ఒకవేళ కాదని జొన్న పంటలు వేసుకుంటే పంట అమ్ముకునే బాధ్యత రైతుదే అని స్పష్టం చేస్తూ వస్తోంది. మండలంలో ఎక్కువగా పత్తి, జొన్న, మొక్క జొన్న పంటలను సాగుచేస్తారు. ఈ యేడాది పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

విత్తనాలు అందుబాటులో ఉంచాలి



మెజార్టీ రైతులు వర్షాధార పంటల సాగుపై ఆధారపడి ఉంటారు. ఎక్కువగా వరి, జొన్న, పత్తి, మొక్కజొన్న, కంది పంటలను సాగుచేస్తారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సహకార సంఘాల్లో, వ్యవసాయ కార్యాలయాల్లో, ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం రైతుబంధు సాయం త్వరగా ఖాతాల్లో వేయాలి.

– కృపానందం, రైతు, నాగారం

సలహాలు, సూచనలు పాటించాలి



కురిసిన రెండు, మూడు వర్షాలను చూసి రైతులు అప్పుడే తొందరపడి విత్తులు వేసుకోవద్దు. కొద్దిపాటి వర్షానికి విత్తు మొలకెత్తడానికి తేమ శాతం సరిపడదు. రైతులు తొందరపడకుండా కావాల్సిన తేమ భూమిలో ఉన్నట్లు తెలిసిన తర్వాతే.. 50 నుండి 60 మి.మీ వర్షం కురుస్తేనే విత్తులు విత్తుకోవాలి. ప్రభుత్వ కార్యాలయంలో కందులు, జనుము, జీనుగ విత్తనాలు సబ్సిడీపైన అందుబాటులో ఉన్నాయి. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– నాగమణి, మండల వ్యవసాయాధికారి, మహేశ్వరం

క్లుప్తంగా

చల్లా పాపిరెడ్డికి నివాళి


పాపిరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మీర్‌పేట: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తండ్రి చల్లా పాపిరెడ్డి సంస్మరణ కార్యక్రమాన్ని ఆదివారం చంపాపేట లక్ష్మారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ నేత కేవీపీ రాంచంద్రరావు, మాజీ ఎంపీ హనుమంతరావు, మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి పాల్గొని చల్లా పాపిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధీర్‌రెడ్డి, కొమరయ్య, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, మహబూబ్‌నగర్ డీసీసీ కొత్వాల్, జ్ఞానేశ్వర్, మల్‌రెడ్డి రాంరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత, స్థానిక మీర్‌పేట నాయకులుబాల్‌రెడ్డి, శ్రీశైలం, కృష్ణ, వెంకటేష్‌గౌడ్, నిమ్మల వెంకటేష్‌గౌడ్, యాదిరెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే మహేశ్వరం అభివృద్ధి

పార్టీ నేత శ్రీరాములుయాదవ్


బోనాలతో యాత్రగా వెళ్తున్న అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు చేపట్టిన అభియాన్ సంపర్క్ యాత్ర బడంగ్‌పేట కార్పొరేషన్‌లో నాలుగో రోజుకు చేరుకుంది. యాత్రకు స్వాగతం పలికేందుకు బీజేపీ నాయకులు, కాలనీవాసులు భారీగా తరలివస్తున్నారు. మహిళలు బోనాలతో తరలివచ్చి అందెలకు ఆశీర్వాదం పలికారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. బీజేపీతోనే మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు భరోసా ఉంటుందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను, బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉన్నారు.

మంత్రి పరామర్శ

పహాడీషరీఫ్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీఆర్‌ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్‌ను మంత్రి సబితారెడ్డి ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ సమీర్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు అంజద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి బేగ్ షాకీర్, అధికార ప్రతినిధి రవూఫ్, నాయకులు ఫెరోజ్, ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ స్కూల్‌కు ఎంపిక

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తా శ్రీవైష్ణవి హైస్కూల్‌కి చెందిన విద్యార్థి జవహర్ నవోదయ స్కూల్‌కి ఎంపికయ్యారు. నవోదయ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో శ్రీవైష్ణవి హైస్కూల్‌లో చదువుతున్న పెండ్యాల గ్రామానికి చెందిన వై.ధనుష్‌రాజ్ ఎంపికయ్యాడు. ధనుష్‌రాజ్‌ను స్కూల్ కరెస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సన్మానించారు.

రోడ్డుపై డ్రైనేజీ వ్యర్థాలను తొలగించండి

దిల్‌సుఖ్‌నగర్: కాలనీలో డ్రైనేజీ వ్యర్థాలు రోడ్డుపైనే వదిలేస్తున్నారు. ఆర్‌కేపురంలోని ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ తదితర కాలనీలలో డ్రైనేజీ శుభ్రం చేసిన సిబ్బంది అందులోంచి తీసిన వ్యర్థాలను రోడ్డుపై వదిలి వెళ్లారు. దీంతో వ్యర్థాల వల్ల ఆ ప్రాంతం మొత్తం దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. దుర్గంధం వల్ల చిన్నారులు రోగాల బారిన పడుతున్నారని, ప్రజారోగ్యంపై జీహెచ్‌ఎంసీ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బస్తీవాసులు వాపోతున్నారు. వ్యర్థాలు అక్కడే వదలడంతో శుభ్రం చేసిన ఫలితం లేదంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై వేసిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నాగార్జున కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని నాగార్జున కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా మీనేందర్ రావు, ఉపాధ్యక్షులు చెరుకు బాలశివుడు, సామ బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి రాజేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జనార్ధన్‌రెడ్డి, మధుసూధన్ రెడ్డి, సలహాదారులుగా మధుసూధన్ రావు, యాదయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శశిధర్ రెడ్డి, పృథ్వీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ప్రభాకర్ రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసరావు, వెంకట మల్లిఖార్జున్, సందీప్, జితేందర్‌ను ఎన్నుకున్నారు.

45వ డివిజన్‌లో ఆధార్ నమోదు కేంద్రం


ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విక్రంరెడ్డి

మీర్‌పేట: ఆధార్ నమోదు కేంద్రాన్ని డివిజన్ వాసులంతా సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ అక్కి మాధవి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ 45వ డివిజన్ డైనమిక్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు క్యాంపును డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ నెల 29 వరకు క్యాంపులో ఆధార్ సంబంధిత సేవలు అందించడం జరుగుతుందన్నారు. నూతన ఆధార్ కార్డు నమోదు, కరెక్షన్స్ (దిద్దుబాటు), మొబైల్ లింక్, ఫొటో అప్‌డేట్ సేవలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎం.దీప్‌లాల్ చౌహాన్, ఈశ్వర్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు వెంకట్‌రావు, నర్సింహరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీవాసులతో మేయర్ పారిజాత

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ శ్రీకృష్ణ హోమ్స్ కాలనీవాసులతో బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత ఆదివారం సమావేశం అయ్యారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీ రేణుకా ఎల్లమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు బాబు, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, నాయకులు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, జగన్, శ్రీరామ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శంకర్, మురళి, అజయ్, మహేష్ తదితరులున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


ఐక్యత చాటుతున్న ఏఐటీయూసీ నేతలు, కార్మికులు

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శంకర్

మీర్‌పేట: మేడే రోజున ప్రభుత్వం పెంచిన వేతనాలను మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అన్ని రంగాల కార్మికులకు అమలు చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాల్వ శంకర్, వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లో వాటర్ లైన్‌మెన్‌లతో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం కొందరికే వేతనాలు పెంచి మరికొందరికి పెంచకపోవడం విభజించు పాలించు అనే విధంగా ఉందని.. పెంచిన వేతనాలు అన్ని రంగాల కార్మికులకు అమలు చేయాలన్నారు. అదే విధంగా జీవో నం 14 ప్రకారం కార్మికులకు రూ.19500 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మీర్‌పేట కార్పొరేషన్ వాటర్ వర్క్స్ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డి, అధ్యక్షుడిగా సురేందర్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాబు, ఉపాధ్యక్షులుగా భిక్షపతి, సతీష్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహ, కార్యదర్శులుగా యాదగిరి, నర్సింగ్‌రావు, సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. బాలాపూర్ మండల కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యం

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి ఆదివారం మంత్రి సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో మట్టి రోడ్ల కారణంగా వర్షాకాలంలో బురదమయంగా మారి అక్కడ నివసిస్తున్న ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారన్నారు. మరోపక్క భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ లేక ఇళ్ల మధ్యనే మురుగు పారుతోందన్నారు. సీతారామశాస్త్రినగర్, పద్మావతినగర్, బొక్క రాంచంద్రారెడ్డికాలనీ, ఖాదర్‌మియాకాలనీ, హైదరాబాద్ టెక్నో స్కూల్ ప్రాంతం, మెట్రోసిటీ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సామ రాంరెడ్డి కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తాళ్ల బాలేష్, సాయికిరణ్ పాల్గొన్నారు.


కందుకూరు: మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్, జెడ్పీటీసీ

యాదవ సంఘం భవనం నిర్మించండి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో యాదవ సంఘం భవనం నిర్మించాలని కోరుతూ ఆదివారం ఆ గ్రామ యాదవులు మంత్రి సబితారెడ్డికి నగరంలో ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ మాట్లాడుతూ... యాదవ సంఘం భవనం నిర్మాణం పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారని, భవనం నిర్మాణం కొరకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మంత్రికి యాదవుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఆసంఘం నాయకులు మల్లయ్య, శ్రీశైలం, పోషయ్య, కృష్ణ, నక్క సురేష్, కోమరయ్య, అయిలయ్య, బుచ్చయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

లింగోజిగూడ: స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహాయసహకారాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కర్మన్‌ఘాట్ లక్ష్మీ కన్వెన్షన్‌లో పదవ, ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన సుమారు 900మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయడంతో పాటు పలువురికి నగదు బహుమతులను అందజేశారు. వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ కాచం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోమ భరత్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్‌గుప్తా, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయం చైర్మన్ గుండా మల్లయ్య పాల్గొన్నారు.

కాలనీల్లోకి చేరిన డ్రైనేజీ నీరు


కోమటికుంట చెరువు నుంచి సీఎంఆర్, సీవైఆర్ కాలనీల్లోకి వెళ్తున్న మురుగు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కోమటికుంట చెరువులోకి వెళ్తున్న డ్రైనేజీ కట్టను రాత్రికి రాత్రే గండికొట్టడంతో ఆ డ్రైనేజీ నీరంతా సీఎంఆర్, సీవైఆర్ కాలనీలోని ఇళ్లల్లోకి చేరుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణారెడ్డి అక్కడికి చేరుకుని వెంటనే డ్రైనేజీ గండిని మూసివేయించారు. కోమటికుంట చెరువును సుందరీకరణ చేస్తామని చెప్పి పనులను మధ్యలోనే నిలిపివేయడంతో పలు కాలనీల నుంచి వస్తున్న డ్రైనేజీ అంతా మరో కుంటలాగా మారిపోయింది. అధికార పార్టీ కార్పొరేటర్లు కావాలనే గండి కొట్టారని కార్పొరేటర్ మాధురి ఆరోపిస్తున్నారు. పనులు చేయడం చేతకాక బీజేపీ కార్పొటర్‌కు చెందిన డివిజన్‌కు మురుగునీరు వెళ్లేలా గండి కొట్టారని విమర్శించారు. వారం రోజుల్లో డ్రైనేజీ అవుట్ లెట్ పనులు ప్రారంభించకపోతే కాలనీవాసులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు శూరకర్ణారెడ్డి తదితరులున్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌కు బాలాపూర్‌వాసుల వినతి


డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: 15వ డివిజన్(బాలాపూర్)లోని పెండిగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌కు ఆదివారం కాలనీవాసులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలోని చర్చి గల్లిలో మంచినీటి పైప్‌లైన్లకోసం సీసీ రోడ్డును అడ్డంగా తవ్వేశారని అన్నారు. పైప్‌లైన్లు పనులు పూర్తయినప్పటికీ రోడ్లు అలాగే వదిలివేయడంతో గుంతలుగా మారి ప్రమాదానికి నెలవుగా ఉన్నాయని గుర్తు చేశారు. వాహనదారులు, పాదచారులు, ముఖ్యంగా వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ప్యాచ్ వర్క్ చేయించేలా చూడాలని కోరారు. పాత లైబ్రెరీ పక్కన ఎలక్ట్రికల్ పోల్ రోడ్డు మధ్యలో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని అట్టి పోల్‌ను రోడ్ చివరకు వేయించేలా చూడాలన్నారు. త్వరలో సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు. విన్నవించిన వారిలో సుదర్శన్‌రావు, నిరంజన్, మహేష్, మధు, భానుచరణ్, శాంతికుమార్, నర్సింగ్‌రావు, కార్తీక్ తదితరులున్నారు.

'దశాబ్ది'తో బీఆర్‌ఎస్ నేతల్లో ఉత్సాహం

- ఏకతాటిపైకి వచ్చిన అసంతృప్తులు
- అన్నీ తానై చూసుకున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అధికారులు, స్థానిక నేతల సమన్వయంతో వేడుకలు
- పార్టీ ప్రచారానికి వాడుకున్నారంటూ విపక్షాల విమర్శలు


ఇటీవల అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలతో నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు (21 రోజుల పాటు) ప్రభుత్వం ఈ ఉత్సవాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. పార్టీ నేతలంతా ఒక్కతాటిపైకి వచ్చి వేడుకల్లో పాల్గొని విజయవంతం చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఉత్సవాల నిర్వహణను అందరినీ సమన్వయం చేసుకుంటూ కీలక పాత్ర పోషించారంటూ నియోజకవర్గంలో టాక్ నడుస్తోంది. అధికారులకు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూ ప్రతి కార్యక్రమంలో అయనే స్వయంగా పాల్గొన్నారు. ఉత్సవాల మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు అన్నీ తానై చూసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాకు విద్యుత్ దీపాలతో అలంకరించడం, జాతీయ పతాకాలను ఎగురవేయడం, రైతు దినోత్సవం, విద్యుత్ విజయోత్సవం, పారిశ్రామిక ఉత్సవం, సాగునీటి దినోత్సవం, సంక్షేమ సంబురాలు, సుపరిపాలన దినోత్సవం, సాహిత్య దినోత్సవం, తెలంగాణ రన్, మహిళా సంక్షేమ దినోత్సవం, అమరవీరుల దినోత్సవం తదితర కార్యక్రమాలను అధికారులతో సమన్వయం చేసుకుని బీఆర్‌ఎస్ శ్రేణులు విజయవంతం చేసుకున్నాయి. అంతేగాక బోనాలు, బతుకమ్మ ఊరేగింపులు చెరువుల వద్ద సందడి, మహిళా దినోత్సవం, భోజనాల కార్యక్రమాలతో ప్రజల్లోకి ఈ ఉత్సవాలను తీసుకెళ్లడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంతో కృషిచేశారు.

ఉత్తేజపరిచిన ఉత్సవాలు

20 రోజులపాటు ప్రతి కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు.. అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజలకు అర్థం అయ్యేరీతిలో కార్యకర్తలు సులువుగా వివరించేందుకు దోహదపడ్డాయి.

పార్టీ ప్రచారానికి వాడుకున్నారు

దశాబ్ది ఉత్సవాలు అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నా ప్రతిపక్ష పార్టీలు ఈ వేడుకలకు దూరంగానే ఉన్నాయి. ప్రజల సొమ్ముతో ఉత్సవాలు నిర్వహించి పార్టీ ప్రచారానికి అధికార బీఆర్‌ఎస్ పార్టీ వాడుకుందని ప్రతిపక్ష పార్టీల ప్రధాన ఆరోపణ. కేసీఆర్, బీఆర్‌ఎస్ సర్కార్ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని.. వారు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటమి తప్పదని కాంగ్రెస్ సీనియర్ నేత ఈసీ శేఖర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నేత సత్యనారాయణ స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటాం

వాసవీ వనిత క్లబ్


పేదలకు సరుకులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడమే వాసవీ వనిత క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథన్ శ్రీనివాస్, ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బొమ్మన జ్యోతి అన్నారు. డాన్ టూ డాస్క్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలోని పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. మాజీ సైనికుడు వెంకటయ్య, ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన లక్ష్మీకి ఆర్థికసహాయం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ సరస్వతి పథకం ద్వారా నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఫీజులు చెల్లించడంతో పాటు ఉచిత వైద్య శిబరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వాసవీ వనిత క్లబ్, డాక్టర్స్‌కాలనీ ప్రతినిధులు లక్ష్మీ, లావణ్య, ధనలక్ష్మీ, మల్లికార్జున, పద్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మీర్‌పేట: లయన్స్ క్లబ్ ఆఫ్ జిల్లెలగూడ గీతాంజలి ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ 16వ డివిజన్ శ్రీ సాయి కృపానగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో కేర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత గుండె సంబంధిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ 320–ఏ గవర్నర్ లయన్ జూలూరి రఘు, 2వ గవర్నర్ డా.మహేంద్రకుమార్ రెడ్డి, క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ సురసాని సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 500 మందికి గుండెకి సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్‌లు అనిల్‌కుమార్ యాదవ్, సిద్దాల బీరప్ప, రాజేందర్ రెడ్డి, క్లబ్ ఆర్గనైజర్ యాదగిరి, కాలనీల అధ్యక్షులు హరీష్, మన్యంరెడ్డి, రాంలాల్ నాయక్, రమణరాజు, కైలాసం, సుబ్బారావు పాల్గొన్నారు.